సాక్షి నిజామాబాద్

శుక్రవారం ◆ 12 ◆ సెప్టెంబర్ ◆ 2025



బిల్లులు సకాలంలో చెల్లించాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులను సకాలంలో చెల్లించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



విద్యారంగంలో తెయూ..

విద్యారంగంలో తెలంగాణ యూనివర్సిటీ గణనీయమైన ప్రగతి సాధించిందని వైస్ చాన్స్‌లర్ యాదగిరి రావు పేర్కొన్నారు.

- 8లో ▸



వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- మున్సిపల్ అధికారులతో సమీక్ష



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పాలనపై కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి దృష్టి సారించారు. బల్దియా పాలన అస్తవ్యస్తంగా మారడంతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండ్రోజుల క్రితం రెవెన్యూ అధికారులతో సమావేశమైన కలెక్టర్ తాజాగా గురువారం టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ పర్మిషన్, ఆక్రమణల తొలగింపు, పెండింగ్ ఫైళ్లపై ఆరా తీశారు. పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని ఏసీపీలు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డిని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ఫీజు తీసుకున్న వారికి వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీలు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డిలతోపాటు టీపీవో ప్రదీప్‌కుమార్, టీపీఎస్‌లు, టీపీబీవోలు పాల్గొన్నారు.


నేడు జిల్లాకు మంత్రి వాకిటి శ్రీహరి

- ఐదు నియోజకవర్గాల్లో విస్తృత స్థాయి సమావేశాలు



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిజామాబాద్ రూరల్, మధ్యాహ్నం 12.30 గంటలకు ఆర్మూర్, 2.30కు బాల్కొండ, 3.45కు బోధన్, సాయంత్రం 5.30 గంటలకు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ స్థాయి సమావేశాలకు హాజరవుతారు. మంత్రితోపాటు బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వినయ్‌రెడ్డి, ముత్యాల సునీల్ రెడ్డి పాల్గొంటారని మానాల పేర్కొన్నారు.

‘సాగర్’ నుంచి 6వేల క్యూసెక్కుల నీటి విడుదల



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ నుంచి వరద వస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి మంజీరలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు గురువారం సాయంత్రం తెలిపారు. ప్రాజెక్టులోకి 6,022 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తుండగా, అదే స్థాయిలో అవుట్ ఫ్లో ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు)కాగా ప్రస్తుతం 1404.99 అడుగుల (17.788 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

రోగుల బారులు..



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో ఓపీ వద్ద బారులు తీరిన రోగులు

ఇటీవల కురిసిన వర్షాల వల్ల సీజనల్ వ్యాధుల ప్రభావంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం 2,156 మంది అవుట్ పేషెంట్లు నమోదయ్యారు. జ్వరాలు, దగ్గు, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రికి వస్తున్నారు. ఒకే రోజు రెండువేలకుపైగా ఓపీ నమోదు కావడం ఈనెలలో తొలిసారి అని ఆస్పత్రి అధికారులు పేర్కొన్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మృత్యు అంచున చేపపిల్లలు

- ఉత్పత్తి కేంద్రంలోనే చేప పిల్లలు
- సైజు పెరిగి కుండీల్లో ఇమడని వైనం
- సరిపడా ఆహారం అందించలేకపోతున్న అధికారులు
- చేప పిల్లలు పంపిణీ చేయాలని మత్స్యకారుల డిమాండ్
- టెండర్ల జాప్యంతో ఇబ్బందులు



ఉత్పత్తి కేంద్రంలోని చేపపిల్లలు

బాల్కొండ: జిల్లాలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ సందిగ్ధంలో పడింది. టెండర్ల నిర్వహణలో జాప్యం కారణంగా మత్స్యకారులకు చేపపిల్లల సరఫరా ఆలస్యమవుతోంది. దీంతో ఎస్సారెస్పీ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేపపిల్లల సైజు పెరిగి కుండీల్లో ఇమడలేక చనిపోయే ప్రమాదం నెలకొంది.

180 చెరువులు, 65 సంఘాలు..

ఎస్సారెస్పీ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం పరిధిలో నందిపేట్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని 180 చెరువులు, 65 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. అయితే ప్రస్తుత సంవత్సరం 54 లక్షల చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. కాగా 30 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేసి నర్సరీల్లో వేశారు. సాధారణంగా 35–40 ఎంఎం సైజు పెరగగానే చేప పిల్లలను చెరువుల్లో వదలాలి. ఇప్పటి వరకు చేపపిల్లలు మత్స్యసహకార సంఘాలకు చేరలేదు. దీంతో నర్సరీల్లోని చేప పిల్లల సైజు 80–100 ఎంఎంకు చేరుకుంటోంది. తద్వారా నర్సరీ కుండీల్లో చేపపిల్లలకు స్థలం సరిపడక చనిపోయే ప్రమాదం నెలకొంది. మరోవైపు చేపపిల్లలకు దాణా కూడా సరిపోయే పరిస్థితి లేదు. దీంతో చేప పిల్లలు చేతికందకుండా పోతాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెండర్‌లతో లింకు వద్దు

రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, ప్రాజెక్ట్‌లకు ప్రభుత్వం నీలి విప్లవంలో భాగంగా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుంది. ఇందుకోసం టెండర్లను నిర్వహిస్తారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చేపపిల్లలను సరఫరా చేస్తారు. అయితే ఇప్పటి వరకు టెండర్లు పూర్తి కాలేదు. ఆ టెండర్లకు, ఉత్పత్తి కేంద్రంలోని చేపపిల్లలకు లింకు పెట్టడంతో పంపిణీకి నోచుకోవడం లేదు. టెండర్లు కూడా ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. టెండర్లకు సంబంధం లేకుండా త్వరగా చేపపిల్లలను పంపిణీ చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

“ ఉన్నతాధికారులకు నివేదించాం

కేంద్రంలోని చేప పిల్లలకు సరిపడా దాణా అందించలేకపోతున్నాం. సైజ్ ఎక్కువగా పెరిగినట్లు ఉన్నతాధికారులకు నివేదించాం. ఆదేశాలు రాగానే చేప పిల్లల పంపిణీ చేపడతాం.

– దామోదర్, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

అద్దె బస్సులతో ఆదాయం

- డీఆర్డీవో సాయాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): సెర్ప్ అందిస్తోన్న రుణంతో మండల సమాఖ్యలు త్వరలోనే అద్దె బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వనున్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు. జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో గురువారం జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. డీఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో మండల సమాఖ్యకు రూ.30 లక్షల రుణమిచ్చి బస్సులు కొనుగోలు చేయిస్తుందని, ఈ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇస్తే నెలకు రూ.70 వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను లక్ష్యానికి అనుగుణంగా పంపిణీ చేయాలన్నారు. మేకలు, గొర్రెలు, పెరటి కోళ్ల పెంపకానికి స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేయాలన్నారు. సమావేశంలో ఏపీడీ మధుసూదన్, డీపీఎంలు నీలిమా, కిరణ్, సంధ్యారాణి, మోహన్, రాజేశ్వర్, జెడ్ఎస్ అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి మమత పాల్గొన్నారు.



నగరంలో భారీ వర్షం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నగరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. 8 గంటలకు ప్రారంభమైన వాన రెండు గంటలపాటు దంచి కొట్టింది. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు ఉప్పొంగాయి. చంద్రశేఖర్ కాలనీ, కంఠేశ్వర్, ఆటోనగర్ మాలపల్లి ప్రాంతాలలో భారీగా వర్షపు నీరు నిలిచింది. మధ్యాహ్నం వేళ చిరుజల్లులు కురవగా, రాత్రివేళ ఒక్కసారిగా భారీ వర్షం రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

భావప్రకటనపై పాశవిక దాడి



- పత్రికా స్వేచ్ఛను హరించడం దుర్మార్గం
- సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై అక్రమ కేసుల నేపథ్యంలో పలువురి సంఘీభావం
- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై ఖండన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు ప్రభుత్వం ‘సాక్షి’ ఎడిటర్ ఆర్ ధనంజయ్‌రెడ్డి, ఇతర పాత్రికేయులపై అక్రమంగా కేసులు బనాయించడంపై అన్ని వర్గాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. 2024 జూన్‌లో టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికా స్వేచ్ఛను, ప్రశ్నించే గొంతులను భౌతిక దాడుల ద్వారా, పోలీసులను ఉపయోగించి తప్పుడు కేసులు పెట్టి తీవ్రంగా అణిచివేస్తున్నారు. ప్రజాసమస్యలు, వివిధ సామాజిక అంశాలపై ప్రతిపక్ష పార్టీల నాయకులు నిర్వహించిన ప్రెస్‌మీట్లకు సంబంధించిన వార్తలు రాసిన సందర్భంలో ‘సాక్షి’ దినపత్రికతో పాటు ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తూ, భావ ప్రకటనా స్వేచ్ఛను తమ గుప్పిట్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతులను నొక్కేస్తున్న అప్రజాస్వామిక చర్యలపై పలువురి స్పందనలు..

గొంతు నొక్కాలని చూస్తే ప్రజలే గుణపాఠం చెబుతారు



ఏపీలో ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారని ఇప్పటి చర్యల వల్ల అర్థం అవుతోంది. జర్నలిస్టులు వారి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదు. ప్రజల గొంతుకగా ఉన్న జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబుకు రెండుసార్లు ప్రజలు గుణపాఠం చెప్పిన విషయం మరిచిపోయినట్లు ఉన్నారు. ప్రజల సంక్షేమ కార్యక్రమాలపై కాకుండా పగతో ఊగిపోవడం సరి కాదు.

– తక్కూరి సతీష్, జిల్లా టెలికం బోర్డు మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మోర్తాడ్

సాక్షి జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య



ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి పత్రిక, ఛానల్ కార్యాలయాలతో పాటు జర్నలిస్టులపై రాజకీయ కక్షతో దాడులకు పాల్పడటం హేయమైన చర్య. పత్రికా వ్యవస్థపై దాడులను జర్నలిస్టు సంఘాలు సహించవు. నిజాలు రాస్తే జీర్ణించుకోలేని పాలకులు ఇలాంటి దాడులతో రాబోయే తరాలకు ఏం సందేశం ఇస్తున్నారో అర్థం కాని పరిస్థితుల్లో సమాజం ఉంది. తప్పులు రాస్తే కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రశ్నించే గొంతుకను అణచివేసేందుకు దాడులు జరిపినంత మాత్రాన జర్నలిస్టులు భయపడతారని అనుకోవడం భ్రమనే అవుతుంది. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులపై దాడులను ప్రతిఒక్కరు ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– దురిశెట్టి నర్సింహా చారి, సీనియర్ జర్నలిస్టు, నిజామాబాద్

మీడియాపై కక్ష సాధింపు మానుకోవాలి



మీడియా మీద దాడులు చేయడం సరైనది కాదు. పూర్తిగా అప్రజాస్వామికం. ఇలాంటి వ్యవస్థను నిర్మూలించాలి. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు మీడియాపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలి. ప్రజల కోసం, ప్రజాస్వామ్యం కోసం పాటుపడే మీడియా ఎంతో ముఖ్యమైనది. అక్రమ కేసులు బనాయించడం వేధింపులకు గురిచేయడం సరికాదు.

– బానోతు రఘురాం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

అప్రజాస్వామిక పద్ధతులు విడనాడాలి



పత్రికలు, మీడియాపై దాడులు చేయడమంటే పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుంది. కుట్రతో అక్రమ కేసులు బనాయించడం, భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. చట్టసభలు, పత్రికలు, బ్యూరోక్రాట్లు ప్రధాన అంగాలు. వీటిలో ఏ ఒక్కటి దెబ్బతిన్నా ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటది. ప్రభుత్వాలు అప్రజాస్వామిక పద్ధతులు విడనాడాలి. పత్రికలపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎ.రమేష్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి

వాక్ స్వాతంత్ర్యంపై దాడి



నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత కార్మికవర్గ సమస్యలు, రైతాంగ సమస్యలు పెరిగిపోతున్నాయి. వీటికోసం జరుగుతున్న ఉద్యమాలను బయటపెడుతున్న పత్రికలను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమకేసులు పెడుతోంది. ఇది ఖచ్చితంగా వాక్ స్వాతంత్ర్యంపై దాడిగానే పరిగణిస్తాం. పత్రికా స్వేచ్ఛపై దాడులు చేయడమంటే నాలుగో స్తంభానికి ప్రమాదం పొంచివున్నట్లే. దీనికి ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదే. నిర్బంధం, అణచివేతలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. అక్రమ కేసులను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– పుప్పల ప్రభాకర్, సీపీఐఎంఎల్ (ప్రజాపంథా) జిల్లాకమిటీ కార్యదర్శి

మీడియా నోరు నొక్కే ప్రయత్నం సరికాదు



ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలను వెలికి తీస్తున్నవారిపై దాడులు, అక్రమ కేసులు పెట్టడం సరికాదు. ప్రజల, ప్రజా సంఘాల, ప్రజల కోసం పనిచేస్తున్నవారి నోరు నొక్కే ప్రయత్నం అమానుషం. ప్రభుత్వ నియంతృత్వ చర్యలను కోర్టులు నిలువరించాలి. అక్రమ కేసులు నమోదు చేయకుండా ప్రభుత్వాలను కట్టడిచేయాలి.

– సమీర్ అహ్మద్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు

పాస్ పుస్తకాలు ఎప్పుడొస్తాయ్?

- నెలల తరబడి నిరీక్షిస్తున్న రైతులు
- పట్టా పాస్‌బుక్‌లు లేకపోవడంతో రుణాలివ్వని బ్యాంకులు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



మోర్తాడ్(బాల్కొండ) : పట్టాదారు పాస్ పుస్తకాలు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కొత్తగా భూములను కొనుగోలు చేసిన అనేక మంది పాస్ పుస్తకాల కోసం మూడు, నాలుగు నెలల నుంచి ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ సందర్భంగా కొత్త పట్టాదారు పాస్ పుస్తకం కోసం రూ.300 వసూలు చేస్తున్నారు. గతంలో పాస్ పుస్తకం ఉన్న వారు భూమిని కొనుగోలు చేస్తే అందులోనే వివరాలను నమోదు చేసి ఇస్తున్నారు.

ఒక్కో మండలంలో 5 నుంచి 10 రిజిస్ట్రేషన్లు..

ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత వ్యవసాయ భూములను తహసీల్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, రిజిస్ట్రేషన్ పత్రాలు, ప్రొసీడింగ్ కాపీ, డూప్లికేట్ పీపీలను అందిస్తున్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ వివరాలు సీసీఎల్ కార్యాలయం ద్వారా బెంగళూరులోని ఏజెన్సీకి వెళ్తాయి. అక్కడ భూమి కొనుగోలు చేసిన వ్యక్తి పేరిట కొత్త పాస్ పుస్తకం ముద్రించి పోస్టులో ఇంటికి పంపిస్తారు. జిల్లాలోని చిన్న మండలాల్లో రోజుకు ఐదు, పెద్ద మండలాల్లో 10 చొప్పున రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇలా గత నాలుగైదు నెలల నుంచి రిజిస్ట్రేషన్లు చేయించుకున్న సుమారు వెయ్యి మందికి ఇప్పటి వరకు పట్టా పాస్ పుస్తకాలు అందలేదు.

బ్యాంకర్ల విముఖత

కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారు పంట రుణాలు తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్ కార్యాలయంలో ఇచ్చే రిజిస్ట్రేషన్ పత్రాలు, ప్రొసీడింగ్ కాపీలను చూపినా పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు విముఖత చూపుతున్నారు. వాస్తవానికి భూ భారతి వెబ్‌పోర్టల్‌లో రైతు వివరాలను పరిశీలించి పంట రుణం ఇవ్వాలని ప్రభుత్వం నిబంధన విధించింది. కానీ, బ్యాంకర్లు మాత్రం ఉన్నతాధికారుల సూచనల ప్రకారం పట్టా పాస్ పుస్తకం పరిశీలన తర్వాతే రుణాలు ఇస్తామని స్పష్టం చేస్తున్నారు.

ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన రైతు నవీన్ ఎకరం వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తహసీల్దార్ ప్రొసీడింగ్ కాపీ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందజేశారు. కొత్త పట్టాపాస్ పుస్తకం పోస్టులో వస్తుందని చెప్పగా, నెల రోజులు గడిచినా ఇంకా రాలేదు. రైతు తహసీల్ కార్యాలయంలో అడిగితే అది తమ పరిధిలో లేదని సమాధానం ఇచ్చారు.

“ మేమిచ్చే పత్రాలు సరిపోతాయి

వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వెంటనే ప్రొసీడింగ్ కాపీ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇస్తున్నాం. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నాం. పాస్ పుస్తకం లేకపోయినా ఆన్‌లైన్‌లో వివరాలను పరిశీలించి బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వాలి. పాస్ పుస్తకాలు పోస్టులో రావడానికి కొంత సమయం పడుతుంది.

– కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

బ్యాక్టీరియా బారిన వరి

- చిరు పొట్ట దశలో సోకిన ఎండాకు తెగులు
- అధిక యూరియా, వాతావరణ మార్పులే కారణమంటున్న వ్యవసాయ అధికారులు
- విస్తరించకుండా యాంటీబయాటిక్ వినియోగిస్తున్న రైతులు



డొంకేశ్వర్ మండలం తొండాకూర్ శివారులో ఎండాకు తెగులు సోకిన వరి పంట

డొంకేశ్వర్(ఆర్మూర్): చిరు పొట్ట దశకు వచ్చిన వరి పంటపై ఎండాకు తెగులు బ్యాక్టీరియా దాడి చేస్తోంది. మోతాదుకు మించి యూరియా వాడకం, తీవ్రమైన ఎండలు, అధిక వానలతో ఎండాకు తెగులు సోకే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. దీనిని నివారించే మందులు లేకపోగా.. ఒక మొక్కనుంచి మరో మొక్కకు వ్యాపించకుండా యాంటీ బయాటిక్స్ రసాయనిక మందులు పిచికారీ చేయడమే మార్గమని సూచిస్తున్నారు.

4,34,695 ఎకరాల్లో సాగు..

ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,34,695 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొలాలన్నీ చిరు పొట్ట దశకు చేరుకున్నాయి. విత్తనాలు బయటికి వచ్చే సమయంలో ఎండాకు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్క పైభాగంలో తెచ్చటి మచ్చలు ఏర్పడి ఆకులు పూర్తిగా ఎండిపోతున్నాయి. ఇది ఒకటి, రెండు మొక్కలతో మొదలై పొలమంతా వ్యాపిస్తోంది. తద్వారా దిగుబడిపై ప్రభావం పడుతుంది. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఆ వెంటనే తీవ్రమైన ఎండలతో వాతావరణం నిలకడగా లేదు. దీనికి తోడు రైతులు పరిమితికి మించి యూరియా చల్లారు. వాస్తవానికి ఎకరానికి మూడు డోసులు కలిపి రెండు నుంచి మూడు బస్తాలు సరిపోతుంది. కానీ, రైతులు పొలం త్వరగా ఎదగాలనే ఉద్దేశంతో ఎకరానికి నాలుగైదు, అంతకుమించి బస్తాల యూరియా వేశారు. దీంతో తెగుళ్లు, చీడపీడలు సోకుతున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. పంటకు సోకిన బ్యాక్టీరియా పూర్తిగా వ్యాపించకుండా రైతులు యాంటీ బయాటిక్స్ మందులను స్ప్రే చేస్తున్నారు.



డొంకేశ్వర్‌లో బ్యాక్టీరియా సోకిన పంటను పరిశీలిస్తున్న ఏవో మధుసూదన్

“ సూచించిన మందులే వాడాలి

ఎండాకు తెగులు వ్యాప్తిని అరికట్టే యాంటీ బయాటిక్స్ రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. అగ్రి మైసస్ లేదా ప్లాంటమైసిన్‌తో కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి. సొంత నిర్ణయాలు తీసుకోవద్దు. స్థానిక వ్యవసాయాధికారులను రైతులు సంప్రదించాలి. పూత దశలో ఉన్నప్పుడు కాపర్ సంబంధిత శిలీంద్ర నాశినులు వాడొద్దు.

– మధుసూదన్, ఏవో, డొంకేశ్వర్

క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఇంటర్వ్యూలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ సబ్జెక్టులు బోధించటానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం గురువారం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు వందమంది అభ్యర్థులు రాగా, వర్సిటీ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం నుంచి ఇంటర్వ్యూలు చేశారు. తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి విషయనిపుణులను సమన్వయం చేశారు. వివిధ విభాగాల కోఆర్డినేటర్స్ నందిని, అతిక్ సుల్తాన్ ఘోరి, భ్రమరాంబిక, నీలిమ సాంకేతిక సహాయం అందించారు.

ప్రశాంతంగా ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఎంఈడీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఒక విద్యార్థికి గానూ ఒకరు హాజరైనట్లు ఆయన తెలిపారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలకు జిల్లా జట్టు ఖరారు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో గురువారం జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల జాతీయస్థాయి బాస్కెట్ బాల్ ఎంపికలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో 13 మంది, బాలిక విభాగంలో ఏడుగురు ఎంపికయ్యారు. వీరిని ఈనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఎంపిక పోటీలకు పంపనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీరెల్లి విజయ్ రావు, బొబ్బిలి నరేష్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి నిఖిల్ తెలిపారు. సంఘ సభ్యులు శ్రీనివాస్, బెనర్జీ , విశాల్, ప్రణీత్, అరుణ్, నవీన్ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లోని రోడ్డు పక్కన గోడలపై వేసిన చిత్రాలు

చిత్రం.. సందేశాత్మకం



ఆర్మూర్‌టౌన్ : మొన్నటి వరకు కళావిహీనంగా కనిపించిన గోడలు.. ప్రస్తుతం సందేశాత్మక చిత్రాలతో ఆకట్టుకుంటున్నాయి. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు వివిధ కార్యాలయాలు, కూరగాయల మార్కెట్ ప్రహరీలు కొత్తందాలను సంతరించుకుంటున్నాయి. సర్కారీ గోడలపై అద్భుతమైన పెయింటింగ్స్ వేస్తూ పట్టణ పురపాలక సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రూ. 4 లక్షలతో శుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, మాదక ద్రవ్యాలను మాన్పించడం, తెలంగాణ సంస్కృతి, రైతుల గౌరవం వంటి అంశాలు ప్రతిబింబించేలా చిత్రాలను గీయిస్తున్నారు. ఇలాంటి చిత్రాలతో గోడ సమీపంలో చెత్త వేయాలనే ఆలోచన రాదని, అవగాహన సైతం పెరుగుతుందని పుర ప్రజలు చెబుతున్నారు.

పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఆర్మూర్ పట్టణాన్ని అందంగా మార్చడమే లక్ష్యం. ప్రజల్లో వివిధ అంశాలపై అవగాహన పెంపొందించేందుకు చిత్రాలు వేస్తున్నాం. దీంతో పరిసరాలు శుభ్రంగా ఉంటాయి. చెత్త వేయాలన్న ఆలోచన రాదు.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

విద్యారంగంలో తెయూ గణనీయమైన ప్రగతి

- వీసీ యాదగిరిరావు
- ఘనంగా వర్సిటీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): విద్యారంగంలో తెలంగాణ యూనివర్సిటీ గణనీయమైన ప్రగతి సాధించిందని తెయూ వీసీ యాదగిరిరావు అన్నారు. క్యాంపస్ ఆవరణలో గురువారం తెలంగాణ యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ 11 సెప్టెంబర్ 2006న 6 కోర్సులు, 12 మంది రెగ్యులర్ అధ్యాపకులతో ప్రారంభం కాగా, గడిచిన 19 ఏళ్లలో రాష్ట్రంలో మూడో అతిపెద్ద యూనివర్సిటీగా పరిణామం చెందడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రస్తుతం 60 మందికి పైగా రెగ్యులర్ అధ్యాపకులు, 50 మందికి పైగా కాంట్రాక్టు అధ్యాపకులు, 13 మంది నాన్ టీచింగ్ సిబ్బంది, 275 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది, మూడు క్యాంపస్‌లలో 31 కోర్సులకు విస్తరించిందన్నారు. అందరి సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని కోర్సులను తెలంగాణ యూనివర్సిటీలో ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. కంట్రోలర్ సంపత్ కుమార్, యూజీసీ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, అధ్యాపకులు అపర్ణ, రవీందర్‌రెడ్డి, ఎల్లోసా, అతీక్ సుల్తాన్ ఘోరి, సత్యనారాయణరెడ్డి, వాణి, భ్రమరాంబిక, స్రవంతి, నీలిమ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, ఏఈ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అమానుషం

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో రోగుల పట్ల ఆస్పత్రి యాజమాన్యం అమానుషంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. నిర్మల్ జిల్లా సొన్ మండలం పాకుపట్ల గ్రామానికి చెందిన రజిత అనే గర్భిణి 7నెలలకే పురిటి నొప్పులతో జిల్లా కేంద్రంలోని వైష్ణవి హాస్పిటల్‌కు కొన్నిరోజుల క్రితం వచ్చింది. ఏడు నెలలకే కవల పిల్లలు పుట్టడంతో వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ద్వారకామయి పిల్లల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. నెల రోజుల చికిత్స అనంతరం వారిలో ఓ పాప గత సోమవారం మృతి చెందింది. అయితే మృతి చెందిన పాపకు వైద్యం అందించామంటూ సుమారు రూ.5లక్షల వరకు ఆస్పత్రి వైద్యులు బాధిత కుటుంబం నుంచి వసూలు చేసింది. అయితే మరో చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు గురువారం చిన్నారి కుటుంబీకులకు సూచించారు. డిశ్చార్జి చేయాలంటే మరో రూ. 3లక్షల బిల్లు చెల్లించాలన్నారు. అప్పటికే అప్పులు చేసి బిల్లులు చెల్లించామని తమ వద్ద ఒక్క రూపాయి లేదని ఇలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్‌కు ఎలా తీసుకెళ్తామని వారు వాపోయారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం కొందరు మధ్యవర్తులు చర్చలు జరిపి డబ్బులు కట్టకుండా పాపను మరో ఆస్పత్రికి తరలించేందుకు వైద్యులను ఒప్పించారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు గురువారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కామారెడ్డి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు ఎల్ నర్సింగ్‌రావు క్రీడా దుస్తులను వితరణ చేశారు. బాలుర విభాగంలో సాయినాథ్, హర్షిత్, శ్రీమన్, శ్రీ రోహన్, అమర్ నాగచైతన్య ఈశ్వర్, లోకేష్, సాయిరాం, రిషికేష్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో రితిక, వైష్ణవి, సహస్ర, సంజన నవీన, నందిని, మనస్విని, నౌషీన్, నవీన, స్వప్న, ఎంపికయ్యారు. వీరు ఈనెల 13 నుంచి జనగాం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. నిజామాబాద్ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్, కార్తీక్, నాయకులు మోత్కూరు నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నాం



విలేకరులతో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

- ఈనెల 15న కామారెడ్డిలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలి
- డీసీసీ అధ్యక్షుడు, సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌కు కట్టుబడి ఉందని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు, సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మానాల మాట్లాడుతూ.. జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచనకు అనుగుణంగా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలుచేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో జరిగిన చర్చకు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు పలికితే, బీజేపీ ఎంపీలు మాత్రం రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని, ద్వంద్వ నీతిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. యూరియా కొరతకు కేంద్రప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. యూరియా కొరత జిల్లాలో పెద్దగా లేదన్నారు. బీసీల రిజర్వేషన్ల నుంచి ముస్లింలను తీసివేయాలని బీజేపీ ఎంపీలు వితండవాదం చేస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 15న కామారెడ్డిలో ముఖ్యమంత్రి హాజరయ్యే బీసీ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, ఓబీసీ అధ్యక్షుడు రాజనరేందర్ గౌడ్, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు కెతావత్ యాదగిరి, సీనియర్ నాయకులు మహ్మద్ ఖుద్దూస్, ప్రమోద్ కుమార్, వేణురాజ్, బోదిరే స్వామి, కేశ మహేష్, తిప్పిరెడ్డి శ్రీనివాస్, ఈసా, అబ్దుల్ ఎజాజ్, సుభాష్ జాదవ్, సంగెం సాయిలున్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి

- అధికారులకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం
- సిరన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన




సిరన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవీపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులను సకాలంలో చెల్లించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నవీపేట మండలంలోని సిరన్‌పల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో 93 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 69 గ్రౌండింగ్ అయ్యాయని, 12 ఇళ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయన్నారు. ఇంకా 24 మంది లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ

నవీపేటలోని ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగాన్ని పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూభారతి అర్జీలను పరిశీలించాలన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ పవన్‌కుమార్, ఎంపీడీవో నాగనాథ్, తహసీల్దార్ వెంకట రమణ ఉన్నారు.

గోదావరిలోకి నిలిచిన నీటి విడుదల



మూసిన ఎస్సారెస్పీ వరద గేట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు గురువారం ఉదయం నిలిపివేశారు. బుధవారం రాత్రికి ప్రాజెక్ట్‌లోకి వరద నీరు పోటెత్తడంతో గోదావరిలో 75 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. తర్వాత క్రమంగా నీటి విడుదలను తగ్గించారు. గురువారం ఉదయం పూర్తిగా నీటి విడుదలను నిలిపి వేశారు. ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌లోకి 385 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అందులో 245 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 19 వేల క్యూసెక్కులు , సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాల కోసం 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి అంతేస్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన కాంపెల్లి రాము అదృశ్యం అయినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. వినాయక్ నగర్‌లోని అంగిటి హోటల్ వద్ద రాము అదృశ్యమయ్యాడని, అతడి మానసిక స్థితి బాగాలేదని సోదరుడు తిరుపతి పేర్కొన్నాడు. తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు, నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా రాము ఆచూకీ తెలిస్తే 8712659840, 8712659836కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బాబాపూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్ గురువారం తెలిపారు. బాబాపూర్‌కు చెందిన జంగిటి నరేష్, సుమలత వద్ద 7.92 లీటర్ల అక్రమ మద్యంను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అక్రమ మద్యం స్వాధీనం ఘటనలో సిబ్బంది దత్తాద్రి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్, రాణిలు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు.

బోధన్ ఎస్‌బీఐలో రూ. 5లక్షల నగదు చోరీ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో రూ. 5లక్షలు చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఈ నెల 8న బ్యాంకు కార్యకలాపాలు నిర్వహిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కౌంటర్ నుంచి రూ. 5లక్షలను చోరీ చేశారు. ఈ విషయాన్ని బ్యాంకు అధికారులు 10వ తేదీన గుర్తించగా, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు కార్యాకలాపాలు జరిగే సమయంలో బ్యాంకు అధికారులు ఎవరు ఏమి చేస్తున్నారో గమనించాలని, బ్యాంకు సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు జీపీ కార్మికుల మృతి

- విద్యుత్ స్తంభాలు తరలిస్తుండగా ఘటన



మృతిచెందిన బాగారే బాలాజీ, బాగారే యాదు

బోధన్‌రూరల్: బోధన్ మండలం బికెనెల్లీ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాలను తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు జీపీ కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలు ఇలా.. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా బికెనెల్లీ గ్రామ శివారులోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో కొత్త స్తంభాలను తీసుకురావడానికి జీపీ డ్రైవర్ రాజు (అవుట్ ఓర్సింగ్), జీపీ కార్మికులు బాగారే బాలాజీ (42) (మల్టీపర్పస్ వర్కర్), బాగారే యాదు (40) (ఔట్‌సోర్సింగ్ వర్కర్) గురువారం రాంపూర్ సబ్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌పై విద్యుత్ స్తంభాలను తీసుకొని గ్రామానికి బయలుదేరారు.

కల్దుర్కి శివారులో ఓవర్ లోడ్ కారణంతో ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌ను నడిపిస్తున్న రాజు గాయాలతో బయటపడగా, ట్రాలీలో ఉన్న బాగారే బాలాజీ, బాగారే యాదుపై స్తంభాలు పడటంతో అక్కడిక్కడే మృతి చెందారు. బోధన్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. జీపీ కార్యదర్శి సుధాకర్ ఆదేశాల మేరకే జీపీ సిబ్బంది ట్రాక్టర్‌లో స్తంభాలను తరలించారని ప్రచారం జరుగగా, ఘటనపై వివరాల కోసం జీపీ కార్యదర్శిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

గుండెపోటుతో టీఏ మృతి



ధనుంజయ్ (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ధనుంజయ్(45) గుండెపోటుతో మృతిచెందారు. విధుల్లో భాగంగా గురువారం ధనుంజయ్ బైక్‌పై బస్సాపూర్ గ్రామానికి బయలుదేరాడు. గ్రామంలో పర్యటిస్తుండగా అస్వస్థతకు గురై గుండెపోటు వచ్చింది. వెంటనే స్థానికులు అతడిని చికిత్సకు తరలించేలోపు మృతి చెందాడు. సమయానికి జీతాలు రాక ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒత్తిడికి గురికావడంతోనే ధనుంజయ్‌కి గుండెపోటు వచ్చిందని తోటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్య



సావిత్రి (ఫైల్)

ఎల్లారెడ్డి: ప్రియుడు మోసం చేయడంతో మనస్తాపం చెందిన ప్రియురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన బత్తుల సావిత్రి (20) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటికి తండ్రి రాంచందర్ ఇంటికి రాగా, ఉరివేసుకున్న కూతురును చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. సావిత్రికి లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డికి చెందిన ఓ యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నదని, అతడు నిరాకరించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి రాంచందర్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూపన్‌పల్లిలో ఓ వ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. గూపన్‌పల్లికి చెందిన చింతకుంట రాజు(30) ఆటోడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా రాజు ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యల కారణంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో గురువారం తీవ్ర మనస్తాపానికి గురై, ఇంటిలో ఎవరు లేని సమయంలో రాజు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోగల మంజీరా నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గురువారం అటువైపుగా వెళ్లిన స్థానికులు నదిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేవని ఎస్సై వెంకట్రావ్ తెలిపారు. మృతురాలు సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలు నీలి రంగు చీర, మెరూన్ కలర్ బ్లౌజ్, ఏడమ కాలుకి నలుపు రంగు తాడు, మెడలో నలుపురంగు తాడు, ఎడమ చేతికి ఆకుపచ్చ, గోల్డ్ కలర్ జులు, రెండుచేతులకి పువ్వుల ఆకారంలో పచ్చబొట్లు ఉన్నట్లు తెలిపారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు పిట్లం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి పదిరోజుల జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించిన, అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వారిలో 15 మందికి జడ్జి రూ. 21,500 జరిమానా విధించారు. బోర్గాం(పి)కి చెందిన చామకూర లక్పతి తరచుగా (మూడుసార్లు) మద్యం తాగి దొరకడంతో జడ్జి అతడికి పది రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు.

ఇసుక వాహనాల పట్టివేత

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మందర్న శివారులో గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను, 2 ఆటోలను సాలూర రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ శశిభూషణ్ తెలిపారు.

కొండ చిలువ పట్టివేత



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో గురువారం 9 అడుగుల కొండ చిలువను పట్టుకున్నారు. అయిలాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి గల డ్రెయినేజీలో అలికిడి రావడంతో గ్రామస్తులు చూడగా భారీ పాముగా గుర్తించారు. వెంటనే నందిపేటకు చెందిన పాములు పట్టే సర్వర్‌కు సమాచారం అందించారు. వెంటనే సర్వర్ అయిలాపూర్‌కు చేరుకుని గ్రామస్తుల సహకారంతో డ్రెయినేజీలోని కొండ చిలువను పట్టుకుని రోడ్డుపై పడవేశాడు. కొంతసేపు కొండచిలువ అటుఇటుగా తిరగడంతో గ్రామస్తులు భయంతో కేకలు వేశారు. చివరికి దానిని అదుపులోకి తీసుకుని సంచిలో వేశాడు. పట్టుకున్న కొండ చిలువను అటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్లు సర్వర్ వివరించాడు.

కుక్కర్ పేలి ఎండీఎం కార్మికురాలికి గాయాలు



మాక్లూర్: పాఠశాలలో మధ్యాహ్న భోజనం (ఎండీఎం) వండుతున్న కార్మికురాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. మండలంలోని అమ్రాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం రాంపూర్ లలిత అనే కార్మికురాలు వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కుక్కర్ పేలింది. దీంతో కుక్కర్‌లోని పప్పు ముఖంపై చిల్లి తీవ్రంగా గాయపడింది. ఉపాధ్యాయులు వెంటనే గమనించిన ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబ సభ్యులు ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లలిత ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు గురువారం ఆస్పత్రిలో లలితను పరామర్శించారు. లలిత వైద్యఖర్చులన్ని జిల్లా విద్యాశాఖ భరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గోడ కూలి వృద్ధ దంపతులకు ..



మద్నూర్(జుక్కల్): మండలంలోని హండేకేలూర్‌లో ఇంట్లోని గోడ కూలడంతో వృద్ధ దంపతులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. హండేకేలూర్‌లోని ఇంట్లో తుమ్మల్‌వార్ హన్మండ్లు, రుక్మిణీబాయి అనే వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. గురువారం ప్రమాదవశాత్తు ఇంట్లోని గోడ కూలి వారిపై పడటంతో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ముజీబ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు ఘటన స్థలానికి చేరుకొని, బాధితులను చికిత్స నిమిత్తం మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజుల క్రితం భారీ వర్షాలు కురవడంతో హన్మండ్లు ఇంటి గోడ నాని తడిసిపోవడంతో కూలిపోయిందని స్థానికులు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లలో ఉండరాదని, ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దని దరాస్ సాయిలు సూచించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు.

బైక్‌ను ఆటో ఢీకొనడంతో దంపతులకు..

ఖలీల్‌వాడి: నగరంలోని కుమార్‌గల్లీ వద్ద ఆటో, బైక్‌ను ఢీకొడంతో ఇద్దరికి గాయాలైన్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని కుమార్‌గల్లీ వద్ద బైక్‌పై సాయిలు, అతడి భార్య వెళుతుండగా వెనుక నుంచి ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిలు, అతడి భార్యకు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.